
సాక్షి కామారెడ్డి

శుక్రవారం ׀ 7 ׀ ఫిబ్రవరి ׀ 2025



ఏళ్ల కల నెరవేరిన వేళ..
సుమారు 1.20 కిలోమీటర్ల మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చడానికి ప్రభుత్వాలకు దశాబ్దాల కాలమే పట్టింది.
- 8లో ▸



శిథిల భవనాలు..
బాన్సువాడ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో భవనాలు శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారాయి.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
37.5 /15.1

వాతావరణం
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి చలి తీవ్రత తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఎకరాకు రూ.17 లక్షల పరిహారం



నిజాంసాగర్ (జుక్కల్) : నాగమడుగు ఎత్తిపోతల పథకం భూ నిర్వాసితులకు ఎకరాకు రూ.17 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తామని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. మండలంలోని వడ్డేపల్లి, జక్కాపూర్ గ్రామ శివారులో నాగమడుగు భూ నిర్వాసిత రైతులతో ఆమె గురువారం మాట్లాడారు. నాగమడుగు ఎత్తిపోతల పథకం పైప్‌లైన్లు , కరకట్ట పనులకు అవసరమైన భూములు ఇచ్చి నిర్మాణ పనులకు సహకరించాలని సూచించారు. ఆమె వెంట నిజాంసాగర్ తహసీల్దార్ భిక్షపతి, డిప్యూటీ తహసీల్దార్ నవీన్ తదితరులు ఉన్నారు.

సెస్ వసూలుకు చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి అర్బన్ : గ్రంథాలయ సంస్థకు బకాయిపడిని లైబ్రరీ సెస్ వసూలు కోసం స్థానిక సంస్థలకు సమాచారం ఇవ్వాలని, వసూళ్ల కోసం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సమావేశంలో వివిధ అంశాలపై మాట్లాడిన అనంతరం సంస్థ 2025 – 26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను ఆమోదించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, డీఈవో ఎస్ రాజు, వయోజన విద్యాధికారి వెంకటేశ్వరరావు, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలంటే భయం వీడాలి



ఎల్లారెడ్డి : విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలని, జిల్లా పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ బలరాం అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. భయం లేకుండా సాధారణ పరిస్థితుల్లో పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. ఇష్టపడి చదివితే విజయం సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పాలు పితికే పోటీలు




పిట్లం(జుక్కల్) : మండలంలోని చిల్లర్గి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రైతులకు గురువారం పాలు పితికే పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశు వైద్యాధికారి సంతోష్ మాట్లాడుతూ.. పరిశుభ్ర వాతావరణంలో సురక్షితమైన పాలు పితికే విధానాలపై అవగాహన కల్పించేందుకు రైతులకు నిర్వహించినట్లు పేర్కొన్నారు. పాలు పితికే సామర్థ్యం ఆధారంగా ముగ్గురు ఉత్తమ రైతులను ఎంపిక చేసి వారికి బహుమతులతోపాటు పాల డబ్బాలు, కాల్షియం బాటిళ్లు, నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో గోపాల మిత్రలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

10న ట్రయథ్లన్ ఎంపిక

కామారెడ్డి అర్బన్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన ఇందిరాగాంధీ స్టేడియంలో జిల్లాస్థాయి యూత్, అండర్ – 14 ట్రయథ్లన్ (మూడు వివిధ క్రీడలు) ఎంపికలు ఉంటాయని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ట్రయథ్లన్ యూత్ విభాగంలో అండర్ – 20, 18, 16, బాలురు, బాలికల విభాగంలో అండర్ – 14లో ఏ, బీ, సి గ్రూప్‌లు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి పాఠశాల నుంచి ఒక్కో విభాగంలో ఇద్దరికి మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు తమ పుట్టిన తేదీ ధ్రువీకరణ లేదా ఎస్సెస్సీ మెమో జిరాక్స్ కాపీతో హాజరుకావాలని సూచించారు.

ఎలక్షన్ మూడ్



536 పంచాయతీలు..
4,696 వార్డులు

ఎన్నికల పనుల్లో అధికారులు బిజీగా మారారు. ఈనెల 27న పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీల పోలింగ్ జరగనుండగా, గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఆయా శాఖల అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఎక్కడ చూసినా ఎలక్షన్ మూడ్ కనిపిస్తోంది.

- ఓ వైపు ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు
- మరో వైపు 'స్థానిక' పోరుకు సన్నద్ధం
- ఏర్పాట్లలో జిల్లా అధికారులు బిజీ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఓ వైపు పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలు.. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లలో జిల్లా యంత్రాంగం బిజీ అయ్యింది. ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరగనుండగా, సిబ్బంది నియామకం, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు జరిగేలా చూసుకోవడంలో అధికారులు బిజీ అయ్యారు. మరో వైపు పంచాయతీ ఎన్నికలు, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తుండడంతో అందుకు సంబంధించిన ఏర్పాట్లలో అధికారులు తీరికలేకుండా పనిచేస్తున్నారు. పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ఆ శాఖ అధికారులు కుస్తీ పడుతుండగా, మండల, జిల్లా పరిషత్ ఎన్నిక పనుల్లో జిల్లా పరిషత్ అధికారులు నిమగ్నమయ్యారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ నెల 27న జరిగే పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలపై ఫోకస్ చేస్తూనే, ప్రభుత్వం నుంచి ఎప్పుడు ఆదేశాలు వచ్చినా పంచాయతీ, మండల, జిల్లాపరిషత్ ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

ఏర్పాట్లలో నిమగ్నం

ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంతోపాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఈ నెల 27న పోలింగ్ జరగనుంది. పోలింగ్ కోసం జిల్లా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. జిల్లాలో16,156 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా, 29 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే 1,995 ఉపాధ్యాయ ఓటర్లకు గాను 25 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు నోడల్ అధికారులను నియమించారు. పనులు చకచకా కొనసాగుతున్నాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో 2019లో పంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో జరిగాయి. అప్పుడు 526 పంచాయతీలు, 4,686 వార్డులు ఉండేవి. ఈ సారి పంచాయతీల సంఖ్య పెరిగింది. సంగారెడ్డి జిల్లా నుంచి బాబుల్‌గావ్ గ్రామం జిల్లాలో చేరగా, తొమ్మిది పంచాయతీలు కొత్తగా ఏర్పడ్డాయి. దీంతో మొత్తం పంచాయతీల సంఖ్య 536కు చేరింది. వార్డులు 4,696కు చేరాయి. పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు 4,715 పోలింగ్‌బూత్‌లు అవసరమవుతాయని అంచనా వేశారు. ఒక్కో బూత్‌కు ఒక్కో బ్యాలెట్ బాక్స్ చొప్పున 4,715 బ్యాలెట్ బాక్సులు అవసరమవుతాయి. ఇప్పటికే బ్యాలెట్ పత్రాలు ముద్రించి సిద్ధం చేసిన పంచాయతీ అధికారులు బాక్సులను సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు 7వేల పైచిలుకు సిబ్బంది వివరాలను ఇప్పటికే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

25 మండలాలు 237 ఎంపీటీసీ స్థానాలు

మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించేందుకు సైతం జిల్లా అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. అప్పట్లో జిల్లాలో 22 మండలాలు ఉండడంతో 22 జెడ్పీటీసీ స్థానాలకు, 236 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. ప్రస్తుతం మూడు కొత్త మండలాలు ఏర్పడడంతో మండలాల సంఖ్య 25 పెరిగింది. దీంతో 25 మండలాలకు సంబంధించి జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అలాగే ఒక స్థానం పెరగగా.. ఎంటీటీసీ స్థానాల సంఖ్య 237కు చేరింది. ఆయా మండలాల్లో జెడ్పీటీసీ స్థానాలతోపాటు ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారు.

మహారాష్ట్ర నుంచి కోళ్లు రాకుండా చర్యలు

- చెక్ పోస్టుల్లో తనిఖీలు నిర్వహించండి
- బర్డ్ ఫ్లూతో అప్రమత్తంగా ఉండాలి
- వ్యాధి వ్యాప్తి చెందక ముందే నివారణ చర్యలు చేపట్టాలి
- అవగాహన సదస్సులో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : మహారాష్ట్రలోని లాతూర్ జిల్లాలో బర్డ్ ఫ్లూ ప్రబలిన నేపథ్యంలో ఆ రాష్ట్రం నుంచి జిల్లాలోకి కోళ్ల రవాణా జరగకుండా సరిహద్దు చెక్ పోస్టుల్లో తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని కోళ్ళ పెంపకం దారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోళ్లలో వచ్చే వివిధ రకాల వ్యాధులపై గురువారం కలెక్టరేట్‌లో కోళ్ల పెంపకం దారులు, పశుసంవర్ధక శాఖ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పౌల్ట్రీ రైతులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.. కోళ్లకు వ్యాధి సోకక ముందే ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలని, వ్యాక్సినేషన్, ఇమ్యునేజేషన్ బూస్టర్‌లు వాడాలన్నారు. చనిపోయిన కోళ్లను దూరంగా పారవేయాలని(ప్రాపర్ డిస్పోజల్) సూచించారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే మండల పశు వైద్యాధికారులను సంప్రదించాలని అన్నారు. జిల్లా పశు వైద్య, పశు సంవర్ధక శాఖాధికారి సంజయ్‌కుమార్, సహాయ సంచాలకులు శ్రీనివాస్, భాస్కరన్, డాక్టర్ ఆర్ దేవేందర్, పశు వైద్యులు, పారా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వందశాతం ఆస్తి పన్ను వసూలు చేయాలి

ఆస్తి పన్ను వంద శాతం వసూలు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లో మున్సిపల్ అధికారులతో పలు అంశాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంటిపన్ను వసూళ్లు, పాత బకాయిలను పూర్తిగా వసూలు చేయాలన్నారు. వసూళ్ల వివరాలు, నివేదికలను ప్రతి రోజూ సాయంత్రం 6 గంటలకు తప్పనిసరిగా సమర్పించాలని ఆదేశించారు. పారిశుధ్య కార్యక్రమాలు క్రమం తప్పకుండా కొనసాగించాలని, సిబ్బంది హాజరు నమోదు చేయాలని, ఇంటింటి నుంచి చెత్త సేకరించాలన్నారు. తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మున్సిపాలిటీ ఆధీనంలోని దుకాణ సముదాయల అద్దె వసూలు చేయాలని సూచించారు. భవన నిర్మాణాలకు సంబంధించిన ఆన్‌లైన్‌లో అనుమతులు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్‌లు, ఇంజినీరింగ్ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు

ఎఫ్‌ఆర్‌వో హత్య కేసులో ఒకరికి యావజ్జీవ ఖైదు

- 13 మందికి జీవితఖైదు నుంచి విముక్తి
- 23 మంది నిర్దోషులుగా విడుదల
- తెలంగాణ హైకోర్టు తీర్పు

ఖలీల్ వాడి/ఇందల్వాయి (నిజామాబాద్ రూరల్): అప్పట్లో రాష్ట్రంలో సంచలనం సృష్టించిన 2013 సెప్టెంబర్ 14న ఇందల్వాయి మండలం నల్లవెల్లి శివారులోని రిజర్వ్ ఫారెస్ట్‌లో జరిగిన ఇందల్వాయి ఫారెస్ట్ రేంజ్ అధికారి గంగయ్య హత్య కేసులో నల్లవెల్లి గ్రామానికి చెందిన ఒడ్డె భాస్కర్‌కు యావజ్జీవ కారాగార శిక్ష ఖరారు చేస్తూ, 13 మందికి యావజ్జీవ ఖైదుని రద్దు చేస్తూ హైకోర్టు గురువారం తీర్పు ఇచ్చింది. కేసు పూర్వపరాల్లోకి వెళితే నల్లవెల్లికి చెందిన భూమి లేని కొందరు పేదలు 309 సర్వే నంబరులోని అటవీ భూమిని చదును చేస్తుండగా అడ్డుకునేందుకు సిబ్బందితో కలిసి వెళ్లిన నాటి ఎఫ్‌ఆర్‌వో గంగయ్యను సదరు రైతులు వెంబడించి కళ్లల్లో కారం కొట్టి దారుణంగా నరికి చంపారు. ఈ కేసులో మొత్తం 37 మంది ముద్దాయిలలో 2017 సెప్టెంబర్ 25న నాటి జిల్లా కోర్టు 14 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. వీరందరూ శిక్షను అనుభవిస్తూ హై కోర్టులో అప్పీలు చేసుకోగా 23 మంది నిర్దోషులుగా, 13 మంది యావజ్జీవ ఖైదును రద్దు చేస్తూ, ఒడ్డె భాస్కర్‌ని ప్రధాన నిందితుడిగా పరిగణిస్తూ జీవిత ఖైదు విధిస్తూ హై కోర్టు తీర్పుని ఇచ్చింది. హై కోర్టు తీర్పు పట్ల శిక్షను అనుభవిస్తున్న కుటుంబాలు హర్షం వ్యక్తం చేయగా, అటవీ శాఖలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. నిజామాబాద్ ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ కోర్టులో జరిగిన నేర న్యాయ విచారణననే ప్రామాణికంగా హైకోర్టు పరిగణిస్తూ తీర్పు వెలువరించడం జిల్లా న్యాయవ్యవస్థకు వన్నె తెచ్చిందని, పలువురు సీనియర్ న్యాయవాదులు పేర్కొన్నారు.



టమాట ధర ఢమాల్

- బాక్సు ధర రూ.80 మాత్రమే..
- ఎన్నో ఆశలతో సాగు చేసిన రైతులు
- పెట్టుబడి కూడా దక్కడం లేదని ఆవేదన



శివాయిపల్లిలో సాగవుతున్న టమాట



రాజంపేట మార్కెట్‌లో రోడ్డుపై పారబోసిన టమాట

రాజంపేట : మార్కెట్లో టమాట ధర ఒక్కసారిగా పడిపోడవండతో రైతులు దిగులు చెందుతున్నారు. రాజంపేట చుట్టు పక్కల గ్రామాలైన శివాయిపల్లి, పెద్దాయిపల్లి, బస్వన్నపల్లి, కోటాల్‌పల్లి గ్రామాలు కూరగాయల సాగుకు పెట్టింది పేరు. అయితే వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి టమాట సాగు చేసిన ధర లేకపోవడంతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

అమ్ముడుపోని టమాట

కామారెడ్డి మార్కెట్ బీట్‌లో ఒకప్పుడు బాక్సు టమాట ధర రూ.400 నుంచి రూ.500 పలకగా.. ప్రస్తుతం రూ.80 మాత్రమే పలుకుతోందని రైతులు వాపోతున్నారు. మరోవైపు చిరు వ్యాపారులు రూ.10కి రెండు కిలోల చొప్పున అమ్మాల్సిన పరిస్థితి ఉంది. రాజంపేటలో బుధవారం సాయంత్రం టమాట అమ్ముడుపోకపోవడంతో కొందరు రైతులు రోడ్డుపై పారబోసి వెళ్లిపోయారు.

చేతికిరాని పెట్టుబడి

శివాయిపల్లిలో ఓ రైతు రూ.20 వేలు ఖర్చు చేసి 15 గుంటల భూమిలో టమాట సాగు చేశాడు. ధర పడిపోవడంతో పెట్టిన పెట్టుబడి చేతికి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. టమాట తెంపకుండా అలాగే వదిలేస్తున్నామని కొందరు రైతులు 'సాక్షి'తో తెలిపారు.

నష్టపోతున్నాం



వేలు ఖర్చు చేసి టమాట సాగు చేస్తే ప్రస్తుతం ధర లేక పోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. కామారెడ్డి మార్కెట్‌కు తరలిద్దామంటే రవాణా ఖర్చులు మీద పడుతున్నాయి. ధర లేక అన్ని రకాలుగా నష్టపోతున్నాం.
– జిల్లెల హేమంత్‌రెడ్డి, రైతు

అడ్డాల్లో భవిష్యత్ బలి!



వ్యసనాల బారిన యువత

- ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లతో భవిష్యత్ నాశనం చేసుకుంటున్న వైనం
- తల్లిదండ్రులను ఏమార్చి సరదాల బాట
- లోపించిన కళాశాలల యాజమాన్యాల నిఘా
- దృష్టి సారించకుంటే అనర్థాలే..

కామారెడ్డి క్రైం : దేశ భవిష్యత్ యువతరం చేతుల్లో ఉందని అంతా భావిస్తుండగా.. అదే యువత చాయ్ అడ్డాలు, గ్రౌండ్‌లలో, చెట్ల కింద కనిపిస్తుండడం ఆందోళనకు గురి చేస్తోంది. మూతి మీద మీసం కూడా మొలవని వయస్సులోనే స్మోకింగ్ జోన్‌లలో కనిపిస్తున్న వారెందరో.. ఆన్‌లైన్ గేములు, ధూమపానం, మద్యపానం, గంజాయి వంటి వ్యసనాల బారిన పడుతూ ఎందరో యువకులు తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. ముఖ్యంగా కామరెడ్డి జిల్లా కేంద్రంలో ఇలాంటి యువకులు ఎక్కువగా కనిపిస్తున్నారు. వ్యసనాల కారణంగా చాలామంది ఆర్థికంగా, ఆరోగ్య పరంగా నష్టపోతుండటం ఆందోళనకు గురి చేసే అంశం. విద్యార్థి దశలో ఉన్న వారిపై తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రవర్తనలో మార్పును గమనించాల్సిందే..

వ్యవసాయం, తమ వృత్తులపై ఆధారపడే కుటుంబాలు తమ పిల్లల భవిష్యత్ బాగుండాలని పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు చేస్తూ పట్టణాల్లో చదివిస్తున్నారు. 'మా వాడు ఉదయాన్నే కాలేజీకి వెళ్ళి బాగా కష్టపడి చదువుకుంటున్నాడని సంబరపడుతుంటారు'. ఇలాంటి వారిలో చాలా మంది యువకులు పెడదోవలో వెళ్తున్నట్లు తల్లిదండ్రులు గుర్తించడం లేదు. కళాశాల యాజమాన్యాలు సైతం పిల్లల హాజరు నమోదు చేస్తున్నాయే తప్ప ఎప్పటికప్పుడు తల్లిదండ్రులతో సమన్వయం చేయడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పట్టించుకునే వారు లేక విద్యాభ్యాసం, క్రమశిక్షణ తప్పి యువత తమ భవిష్యత్‌ను తామే నాశనం చేసుకుంటున్నారు. పిల్లల ప్రవర్తన తీరులో వచ్చే మార్పులు, విద్యాబోధన తీరుపై విద్యా సంస్థలు, తల్లి దండ్రులు దృష్టి సారించాల్సిన అవసరం కనిపిస్తోంది.

ఆన్‌లైన్ గేమ్‌లు.. వ్యసనాలు

స్మార్ట్ ఫోన్ కారణంగా యువత ప్రవర్తనలో చాలా వ్యత్యాసం కనిపిస్తోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని సరైన మార్గంలో ఉపయోగించుకుంటున్న వారు కొందరైతే దుర్వినియోగం చేస్తున్న వారు ఎందరో.. పొద్దంతా రీల్స్ వ్యామోహంలో గడిపే వారి సంఖ్య ఎక్కువే. ఏడాది క్రితం స్మోకింగ్ జోన్‌లు, ఇతర అడ్డాలపై పోలీసులు దృష్టి సారించి చాలా మట్టుకు మూసి వేయించగా ప్రస్తుతం యథాతథంగా నడుస్తున్నాయి. ఎంతో మంది యువత గంజాయికి అలవాటుపడగా, కొందరు మద్యం, కల్తీ కల్లు వంటి వ్యసనాలకు బానిసలుగా మారుతున్నారు. మరి కొందరు క్రికెట్ బెట్టింగ్ మోజులో లక్షలు పోగొట్టుకున్న ఘటనలు అనేకం ఉన్నాయి.

స్మోకింగ్ జోన్‌లలో..

జిల్లా కేంద్రంలో ఇటీవల పదుల సంఖ్యలో స్మోకింగ్ జోన్‌లు వెలిశాయి. చాయ్ పేరుతో ఏర్పాటు చేస్తున్న వీటిల్లో లోపలి వైపు ప్రత్యేకంగా స్మోకింగ్ జోన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో యువకులే ఎక్కువగా కనిపిస్తున్నారు. స్నేహితులతో కలిసి గ్రూపులుగా వెళ్లే యువకులు చాయ్, సిగరెట్లు తాగుతూ గంటల తరబడి పబ్జీ వంటి ఆన్‌లైన్ గేమ్స్‌లో మునిగిపోతున్నారు. కళాశాలల సమయంలో సైతం స్మోకింగ్ జోన్‌లలో విద్యార్థులు కనిపిస్తుంటారు.

వ్యసనాల బారిన పడొద్దు



విద్యార్థి దశలో దురలవాట్ల వైపు ఆకర్షణ ఎక్కువగా ఉంటుంది. పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. తగిన జాగ్రత్తలు తీసుకుంటూ వారి నడవడికపై ఓ కన్నేసి ఉంచాలి. దురలవాట్ల బారిన పడితే అనారోగ్య సమస్యలు తప్పవు. వాటి నుంచి బయటకు తెచ్చేందుకు కౌన్సెలింగ్ ఇవ్వాల్సి ఉంటుంది. ముందు జాగ్రత్తే అన్నింటికీ మంచిది. – డాక్టర్ జి.రమణ, మానసిక ఆరోగ్య వైద్య నిపుణులు, కామారెడ్డి

మత్తుకు దూరంగా ఉండాలి



యువత మత్తు పదార్థాలు, ఇతర దురలవాట్లకు దూరంగా ఉండాలి. తల్లి దండ్రులు కూడా ఓ కన్నేసి ఉంచాలి. పోలీస్ శాఖ తరపున యువతకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై నిఘా కొనసాగుతోంది. బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గేమ్స్, వ్యసనాలను వదిలి చదువుపై దృష్టి సారించాలి.
– చంద్రశేఖర్ రెడ్డి, ఎస్‌హెచ్‌వో, కామారెడ్డి

క్లుప్తంగా

సౌత్‌క్యాంపస్‌లో హెచ్‌వోడీ, బీవోఎస్‌ల నియామకం



భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో హెచ్‌వోడీలు, బీవోఎస్‌లను నియమించారు. ఈమేరకు తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ యాదగిరిరావు గురువారం నియామక పత్రాలను అందజేశారు. ఫిజిక్స్ డిపార్టుమెంట్ హెచ్‌వోడీగా డాక్టర్ మోహన్‌బాబు, సోషల్‌వర్కు డిపార్టుమెంట్ హెచ్‌వోడీగా డాక్టర్ అంజయ్య, జియో ఇన్ఫర్మాటిక్స్ డిపార్టుమెంట్ హెచ్‌వోడీగా సబితలు నియమితులయ్యారు. అలాగే ఫిజిక్స్ బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ హరిత, కెమిస్ట్రీ బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా డాక్టర్ నాగరాజు నియమితులయ్యారు. వీరికి వైస్ చాన్సలర్ యాదగిరిరావు నియామక పత్రాలను అందజేసి అభినందించారు.

తమిళనాడులో సత్తాచాటిన మాచారెడ్డి విద్యార్థులు



మాచారెడ్డి: మండలంలోని సోమారంపేట, ఘన్‌పూర్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు జనవరి 28 నుంచి ఈ నెల 3 వరకు తమిళనాడులోని తిరుచిరాపల్లిలో నిర్వహించిన ఆయా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని సత్తా చాటారు. జంబూరి, మార్చ్ ఫాస్ట్, విచిత్ర వేషధారణ పోటీలు, నృత్య పోటీలలో పాల్గొని అందరి మన్ననలు పొందినట్లు గురువారం హెచ్ఎంలు భాస్కర్, శారదలు సాక్షికి వివరించారు. వారి వెంట స్కౌట్స్ అండ్ గైడ్స్ కమిషనర్ గోపాలకృష్ణ, పీడీ సంధ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

డబ్బులు డిమాండ్ చేసిన హెడ్‌కానిస్టేబుల్

- ఎస్పీకి ఫిర్యాదు
- విచారణకు ఆదేశం

భిక్కనూరు: భిక్కనూరు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ ఒకరు డబ్బులు డిమాండ్ చేసిన ఘటనపై ఎస్పీకి ఈ–మెయిల్ ద్వారా ఫిర్యాదు అందింది. వివరాలు.. పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన ఒక వృద్ధురాలు కుటుంబ నిర్ధారణ ధ్రువీకరణ పత్రంపై సంతకం కోసం బుధవారం ఒక యువకుడితో కలిసి పోలీస్‌స్టేషన్‌కు వచ్చింది. అక్కడ డ్యూటీలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ డబ్బులు డిమాండ్ చేసి తీసుకున్నాడని యువకుడు ఈ–మెయిల్ ద్వారా ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. దీంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్, ఎస్సై ఆంజనేయులు ఈ విషయమై ఆ యువకుడిని గురువారం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

టోల్ ఫ్రీ సదుపాయం కల్పించాలని వినతి

నిజాంసాగర్ (జుక్కల్): నాందేడ్– సంగారెడ్డి జాతీయ రహదారిపై ధర్మారం శివారులో ఉన్న టోల్ ప్లాజా వద్ద టోల్ ఫ్రీ సదుపాయం కల్పించాలని జుక్కల్, బిచ్కుంద మండలాల టీచర్లు పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ కుమార్‌ను కోరారు. ఈ మేరకు పిట్లం మండల కేంద్రంలో ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై టోల్ అధికారులతో మాట్లాడతానని మార్కెట్ కమిటీ చైర్మన్, టీచర్లకు సూచించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

సీనరేజ్ చెల్లిస్తేనే అనుమతి

- ఉచిత ఇసుక పథకం పక్కదారి పట్టడంతో అధికారుల నిర్ణయం
- వాగులపై వ్యాపారులదే పైచేయి ఉండటంతో నిబంధనల సవరణ



సుంకెట్ పెద్దవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): ఇసుకను తరలించే వ్యాపారులు ఒక్కో ట్రిప్పుకు రూ.900ల చొప్పున సీనరేజ్ చార్జీలను చెల్లించాలని జిల్లా అధికార యంత్రాంగం నిర్ణయం తీసుకుంది. ఇళ్లు నిర్మించుకునేవారికి ఉచితంగా ఇసుకను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఈ విధానం పక్కదారి పట్టడంతో కట్టడి కోసం అధికార యంత్రాంగం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. నిర్దేశించిన ఇసుక పాయింట్ల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటే సీనరేజ్ చార్జీలను డీడీల రూపంలో ప్రభుత్వ ఖజానాకు సొమ్మును జమ చేయాల్సి ఉంటుంది.

17చోట్ల ఇసుక పాయింట్లు..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఏప్రిల్‌లో ఉచిత ఇసుక విధానం అమలులోకి తీసుకవచ్చింది. దీంతో ఇళ్లను నిర్మించుకునేవారు అధికారుల అనుమతి తీసుకుని సొంతంగా ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసుకొని, ఇసుకను తీసుకోవాల్సి ఉంటుంది. వారికి గతంలో మాదిరిగా సీనరేజ్ చార్జీలను చెల్లించడం మినహాయించారు. జిల్లాలోని పెద్దవాగు, కప్పలవాగు, పూలాంగ్ వాగు, పసుపు వాగులపై 17 చోట్ల ఇసుక పాయింట్లను గుర్తించారు. ఈ పాయింట్ల నుంచి ఇసుకను జిల్లాలో ఎక్కడైనా ఇంటిని నిర్మించుకునేవారు ఉచితంగానే తరలించుకోవచ్చు. ఉచిత ఇసుక విధానం అమలులోకి వచ్చిన తరువాత వ్యాపారులే ఇంటిని నిర్మించుకునేవారి పేరిట అనుమతులు పొంది తమ వ్యాపారం సాగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఒక్కో ట్రాక్టర్ లోడ్‌ను రూ.5వేల నుంచి రూ.6వేల వరకు వ్యాపారులు విక్రయిస్తున్నారని తేలింది. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడటమే కాకుండా వ్యాపారులకు కలిసి రావడం, ఇసుకను కొనుగోలు చేసేవారికి ధర తగ్గకపోవడంతో ఉచిత ఇసుక విషయంలో నిబంధనలను అధికారులు సవరించారు. ఇంటిని నిర్మించుకునేవారు సొంతంగా తరలించుకుంటే ఉచిత అనుమతులు ఇవ్వనున్నారు. వ్యాపారులు అనుమతులు తీసుకుంటే మాత్రం సీనరేజ్ చెల్లించాలని నిర్ణయించారు. దీంతో అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట పడిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

> **డీడీలు చెల్లిస్తేనే అనుమతులు**
>
> ఇసుక తరలించడానికి వ్యాపారులు గతంలో మాదిరిగా డీడీలు చెల్లించాల్సి ఉంది. ఉచితంగా అనుమతులు ఇచ్చినా ఇంటిని నిర్మించుకునే వారికి తక్కువ ధరకు ఇసుక లభించకపోవడంతో ఉన్నతాధికారులు మార్పులు చేశారు. ఇసుక పాయింట్‌ను నిర్వహించాలంటే సీనరేజ్ జమ చేస్తేనే అనుమతులు ఇస్తాం.
>
> – సీహెచ్ కృష్ణ, తహసీల్దార్, మోర్తాడ్

ఆ గట్టు సూచిక బోర్డు ఈ గట్టుపై..



రామారెడ్డి వైపు ఉన్న ఇసన్నపల్లి సూచిక బోర్డు

రామారెడ్డి: రోడ్డుకు ఓవైపు ఒక ఊరు ఉంటే మరో వైపు ఇంకో ఊరు ఉంటుంది. అవే రామారెడ్డి, ఇసన్నపల్లి గ్రామాలు. ఈ రెండు గ్రామాలను వేరు చేసేది రోడ్డే. ఇది తెలియని ఆర్‌అండ్‌బీ అధికారులు అన్నారం నుంచి కామారెడ్డికి వెళ్లే మార్గంలోని కాలభైరవ ఆలయం దగ్గర రామారెడ్డి గ్రామం వైపు ఇసన్నపల్లి సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. కాలభైరవ స్వామి ఆలయ దర్శనానికి నిత్యం భక్తులు వేల సంఖ్యలో వస్తుంటారు. అసలే అయోమయంగా రోడ్డుకు ఓ వైపు ఇసన్నపల్లి, మరోవైపు రామారెడ్డి గ్రామం ఉండగా ఆర్‌అండ్‌బీ అధికారులు మరింతగా అయోమయం కల్గించే విధంగా బోర్డు ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి సూచిక బోర్డును సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నియామకం



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ డిపార్టమెంటల్ ఆఫ్ కెమిస్ట్రీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా డాక్టర్ ధరావత్ నాగరాజు నియమితులయ్యారు. ఈమేరకు వీసీ యాదగిరిరావు గురువారం నియామకపు ఉత్తర్వులను ఆయనకు అందించారు. నాగరాజు మాట్లాడుతూ.. నా మీద నమ్మకంతో నియామక ఉత్తర్వులు అందించిన వీసీ యాదగిరిరావుకు, రిజిస్ట్రార్ యాదగిరికి కృతజ్ఞతలు తెలిపారు.

బయోటెక్నాలజీ విభాగంలో..



మహేందర్

డిచ్‌పల్లి: తెయూ బయోటెక్నాలజీ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ఐదే నిమహేందర్ నియమితులయ్యారు. ఈమేరకు వీసీ యాదగిరిరావు ఆయనకు నియామక ఉత్తర్వులను గురువారం అందజేశారు. ప్రస్తుతం తెయూ చీఫ్ వార్డెన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మహేందర్ గతంలో సారంగాపూర్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా, అడిషనల్ కంట్రోల్‌ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా, యూ జీసీ కోఆర్డినేటర్‌గా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీ సర్‌గా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. ఈ బాధ్యతలు అప్పగించిన వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరికి కృతజ్ఞతలు తెలిపారు.

కామారెడ్డి రైల్వేస్టేషన్‌లో సమస్యలు పరిష్కరించాలి



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టెటివ్ కమిటీ సభ్యుడు మొగిలిపల్లి భూమేశ్ కోరారు. గురువారం దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన డీఆర్‌యూసీసీ 71వ సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాపార, వాణిజ్యపరంగా కామారెడ్డి రైల్వేస్టేషన్ ఆదాయం తెచ్చిపెడుతున్నందున ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అశోక్‌నగర్ రైల్వే గేట్‌తో పట్టణ ప్రజల ఇబ్బందులు, రైల్వే క్యాంటీన్‌లో పరిశుభ్రత, ఆహార నాణ్యత, స్వచ్ఛమైన నీరు లభ్యత, అదనపు టికెట్ కౌంటర్, లిఫ్టు పని చేసే విధంగా చర్యలు, దేవగిరి ఎక్స్‌ప్రెస్‌లో ముంబయి నుంచి కామారెడ్డికి లగేజీ వచ్చే ఏర్పాటు చేయాలని డివిజనల్ మేనేజర్‌కు విజ్ఞప్తి చేశారు.

జడ్జి పోస్టులను భర్తీ చేయాలి



ఖలీల్‌వాడి: జిల్లా కోర్టులో ఖాళీగా ఉన్న జడ్జి పోస్టులను భర్తీ చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్‌మోహన్‌గౌడ్ అడ్మినిస్ట్రేటివ్ జడ్జిగా నియమితులైన రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ ఎన్ తుకారాంజీకి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కోర్టు పక్కన ఉన్న ఓల్డ్ విద్యాశాఖ కార్యాలయ స్థలాన్ని జిల్లా కోర్టు అవసరాలకు కేటాయించే విధంగా చొరవ చూపాలని కోరారు. జిల్లా కోర్టులోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం హైకోర్టు జడ్జిని సన్మానించారు. హైకోర్టు ప్రాంగణంలోని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, అదనపు గవర్నమెంట్ ప్లీడర్ మహేశ్ రాజ్‌లను సైతం మర్యాద పూర్వకంగా కలిసినట్లు వారు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

ఆటోను ఢీకొన్న లారీ

- ఇద్దరు ప్రాణస్నేహితుల మృతి
- మాక్లూర్‌లో విషాదం



ఇంతియాజ్ (ఫైల్)



షేక్ ఫరాన్ (ఫైల్)

నిజామాబాద్ రూరల్/మాక్లూర్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీనగర్ శివారులో ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరు ప్రాణస్నేహితులు మృతి చెందారు. మృతులిద్దరూ మాక్లూర్ మండలకేంద్రానికి చెందినవారు కాగా గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. రూరల్ సీఐ సురేష్ తెలిపిన వివరాలు ఇలా.. మాక్లూర్ మండల కేంద్రానికి చెందిన షేక్ ఫరాన్(25), ఇంతియాజ్(25) ఇద్దరు ప్రాణ స్నేహితులు. ఒకరు వెల్డింగ్ పని, మరొకరు ఆటో నడుపుతూ జీవనం కొనసాగించేవారు. గురువారం వారు ఆటోలో మాక్లూర్ నుంచి రూరల్ మండలంలోని గుండారం గ్రామానికి ప్యాసింజర్‌లను దింపడానికి వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా శ్రీనగర్ శివారులో వారి ఆటోను ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడని, లారీని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఆయన వివరించారు. ఫరాన్‌కు వివాహం జరిగి, మూడు నెలల పాప ఉన్నట్లు సమచారం. అందరితో కలుపుగోలుగా ఉండే స్నేహితులు మృతిచెందడంతో గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు.

తల్లీకుమారుడి అదృశ్యం

కోటగిరి(రుద్రూర్): కోటగిరి మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన జ్యోతి (24), తన కుమారుడితో సహ అదృశ్యమైనట్లు ఎస్సై సందీప్ గురువారం తెలిపారు. జ్యోతి తన ఏడాదిన్నర కుమారుడిని తీసుకుని బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి, ఇప్పటికీ తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కలా ఎంతవెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మహిళకు మాటలు రావని, వీరి ఆచూకీ లభిస్తే కోటగిరి ఎస్సై 87126 59878, రుద్రూర్ సీఐ 87126 59875కు సమాచారం అందించాలని కోరారు.

పేకాడుతున్న పలువురి అరెస్టు

ఖలీల్‌వాడి: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీప్రియనగర్, కస్తూర్బాకాలనీల్లో నిర్వహిస్తున్న పేకాటస్థావరాలపై దాడులు చేసి, పేకాడుతున్న వారిని అరెస్టు చేసినట్లు నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య గురువారం తెలిపారు. పేకాడుతున్న ఏడుగురి వద్ద నుంచి రూ.30,500, ఏడుసెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని తదుపరి చర్యల నిమిత్తం నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆర్మూర్ పట్టణంలో..

ఆర్మూర్‌టౌన్: పెర్కిట్ రైల్వేస్టేషన్ సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గురువారం తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి రూ. 4570 నగదు, ఏడు మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఖలీల్‌వాడి: నిజామాబాద్–జాన్కంపేట్ రైల్వేస్టేషన్ పరిధిలోని అర్సపల్లి గేట్ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి గురువారం తెలిపారు. నిజామాబాద్ రైల్వే స్టేషన్ మేనేజర్ హరికృష్ణ, ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా..అర్సపల్లి రైల్వే గేట్ సమీపంలో గుర్తు తెలియని రైలు నుంచి గుర్తుతెలియని ప్రయాణికుడు జారిపడి మృతిచెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి, మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. మృతుడికి సుమారు 25నుంచి 30ఏళ్ల వయస్సు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించినట్లు చెప్పారు. మృతుడి వివరాలు తెలిస్తే నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో గానీ, రైల్వే ఎస్సై నెంబర్ 8712658591కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

ధర్పల్లి: మండలకేంద్రంలో గురువారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రంలోని గోసంగి కాలనీకి చెందిన అల్లెపు పెంటయ్య (55) కుమారుడి భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో పెంటయ్య మనస్తాపం చెంది గురువారం మధ్యాహ్నం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతడిని కుటుంబ సభ్యులు గమనించి వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పెంటయ్య చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో పలువురికి జైలు శిక్ష

రుద్రూర్: రుద్రూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా రాణంపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మద్యం తాగి బైక్ నడుపుతూ పట్టుబడ్డాడు. నిందితుడిని గురువారం బోధన్ కోర్టులో హాజరు పరుచగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేష తల్పసాయి రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు రుద్రూర్ ఎస్సై సాయన్న తెలిపారు.

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా నవీపేట్ మండలం చాటాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. అతడిని గురువారం ఆర్మూర్ కోర్టులో హాజరుపర్చగా జడ్జి రెండు రోజుల జైలు శిక్షణ విధిస్తూ తీర్పునిచ్చినట్లు పోలీసులు తెలిపారు .

ఏళ్ల కల నెరవేరిన వేళ..!

- ఉప్పల్‌వాయి- మోషంపూర్ రోడ్డు పనులు పూర్తి



బీటీ రోడ్డుగా మారిన ఉప్పల్‌వాయి-మోషంపూర్ రోడ్డు

రామారెడ్డి: సుమారు 1.20 కిలోమీటర్ల మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చడానికి ప్రభుత్వాలకు దశాబ్దాల కాలమే పట్టింది. ఎన్ని ప్రభుత్వాలు మారినా రెండు గ్రామాల ప్రజలు మాత్రం వర్షాకాలంలో దశాబ్దాలుగా పడరాని పాట్లు పడ్డారు. ఎట్టకేలకు ఈ రోడ్డు పనులు పూర్తి చేసుకుని దశాబ్దాల కల నెరవేరిన వేళ ఉప్పల్‌వాయి–మోషంపూర్ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ.కోటి 20 లక్షల రాష్ట్ర ప్రభుత్వ నిధులతో బీటీ రోడ్డు నిర్మాణం పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఉప్పల్‌వాయి ప్రజలు కామారెడ్డి వైపు వెళ్లాలంటే ఈ రోడ్డు మార్గంలోనే వెళ్తారు. మోషన్‌పూర్ ప్రజలు మండల కేంద్రం రామారెడ్డికి రావాలంటే ఇదే రోడ్డు మార్గం అందుబాటులో ఉంటుంది. రెండు గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో క్రీడలు



క్రీడలను ప్రారంభిస్తున్న అధ్యాపకులు



కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మేరా యువ భారత్‌లో భాగంగా నెహ్రూ యువ కేంద్రం వారు విద్యార్థులకు క్లస్టర్ ఆఫ్ బ్లాక్ స్పోర్ట్స్ పోటీలు నిర్వహించారు. బాన్సువాడ, నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాలకు చెందిన యువకులకు వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, 200 మీటర్ల రన్నింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి జిల్లా స్థాయి ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల స్వామి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ భూలక్ష్మి, ఎస్ఎస్ఎల్ కళాశాల ప్రిన్సిపల్ ప్రశాంత్, నెహ్రూ యువ కేంద్ర వాలంటీర్ సునీల్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి



గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వర్లు



లింగంపేట జూనియర్ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని, రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. తాడ్వాయి బాలికల గురుకుల పాఠశాలలో గురువారం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు, చిన్న పిల్లలపై జరుగుతున్న నేరాలు, సైబర్‌నేరాలు, రోడ్డుభద్రత, మైనర్ల డ్రైవింగ్, బాల్యవివాహాలు తదతర విషయాలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో 100 నంబరుకు ఫోన్ చేసినట్లయితే తగిన సహాయాన్ని అందిస్తామన్నారు. ప్రిన్స్‌పల్ సురేఖ, ఏఎన్ఎం సాబేరా బేగం, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లింగంపేట జూనియర్ కళాశాలలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని షీటీమ్ సభ్యులు గురువారం లింగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సూచించారు. షీటీమ్ అంటే ఏమిటి.. వారు ఎలా పని చేస్తారో వివరించారు. ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, మహిళల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాల కార్మికులు, పని వేధింపులు తదితర విషయాల గురించి వివరించారు. మహిళలను వేధించినా, వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా కేసులు నమోదు చేస్తామన్నారు. విద్యార్థినులను వేధింపులకు గురిచేస్తే వెంటనే సైబర్ టోల్ ఫ్రీ నంబర్ 1930కు, 100, 1010 నంబర్లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. షీటీం సభ్యులు శ్రీనివాస్, సుప్రజ, కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నగరంలో భారీగా గంజాయి పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలో ఎండు గంజాయి అమ్ముతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించగా సుమారు 2కిలోలకు పైగా గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న గురువారం తెలిపారు. బుధవారం రాత్రి ద్వారకామాయి కాలనీ వద్ద ఎక్సైజ్ ఎన్స్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో దాడులు చేయగా మహ్మద్ యూసుఫ్ అనే వ్యక్తి వద్ద 2.026 కిలోల గంజాయి, షేక్అలీం అనే వ్యక్తి వద్ద 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. యూసుఫ్‌పై గతంలో గంజాయి కేసులు ఉండగా పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చినట్లు తెలిపారు. నగరంలో ఒకే గ్యాంగ్ గంజాయి సరఫరా చేస్తున్నట్లు పోలీస్ వర్గాలు గుర్తించినట్లు తెలుస్తోంది. వీరిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదులు చేస్తే గంజాయి సరఫరా నిలిచిపోతుందని పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం.


బిచ్కుంద మండలంలో..

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని కందర్‌పల్లి గ్రామం వద్ద గురువారం ఎండు గంజాయి పట్టుకున్నామని ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. దెగ్లూర్‌కు చెందిన అర్జున్ భగత్‌సింగ్ భండారి అనే వ్యక్తి నాందేడ్‌లో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి, వాటిని చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి బిచ్కుంద, మద్నూర్, దెగ్లూర్ ప్రాంతాల్లో విక్రయించేవాడు. అతడు గంజాయి అమ్మడానికి బిచ్కుంద వస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో కందర్‌పల్లి వద్ద ఎండు గంజాయితో పట్టుకున్నామని ఎస్సై తెలిపారు. అతడి వద్దనుంచి 154 గ్రాముల ఎండు గంజాయి, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి ఏడేళ్ల జైలు

ఖలీల్‌వాడి: ఒకరి మృతికి కారణమైన వ్యక్తి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ నిజామాబాద్ జిల్లా జడ్జి సునీత కుంచాల గురువారం తీర్పు వెల్లడించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం చిన్నరాంపూర్ గ్రామానికి చెందిన సమీవుద్దీన్, మహ్మద్ వాసిమొద్దీన్ అన్నదమ్ముల కొడుకులు. నిజామాబాద్‌లో పూలు విక్రయించే ముస్తఫాఖాన్ దగ్గర వాసిమోద్దీన్ పనిచేస్తుండగా అతడి వద్ద సుమారు రూ. 50వేలకు పైగా అప్పు చేశాడు. బాకీ తీర్చమని ముస్తఫాఖాన్ ఒత్తిడి చేయగా, వాసిమోద్దీన్ కుటుంబసభ్యుల పేరు మీద బ్యాంకులో సుమారు రూ.60వేలు లోన్ తీసుకున్నాడు. ముస్తాఫాఖాన్‌కు డబ్బులు చెల్లించివస్తానని షేక్ సమీవుద్దీన్ బైక్‌పై వెళ్లివచ్చాడు. కానీ రూ.45వేలు మాత్రమే చెల్లించాడని వాసిమోద్దీన్‌కు తెలియడంతో సమీవుద్దీన్‌తో గొడవపడ్డాడు. ఈక్రమంలో వాసిమోద్దీన్ కత్తితో సమీవుద్దీన్‌పై కత్తితో దాడిచేయగా తీవ్ర గాయాలతో మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేయగా, కోర్టులో విచారణ జరిగింది. నిందితుడు వాసిమోద్దీన్‌కు ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ. 2వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని యెడల అదనంగా ఆరు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పు వెల్లడించారు. అలాగే సాక్ష్యాధారాలు లేకుండా చేయడానికి యత్నించినందుకు మూడేళ్ల కఠిన శిక్షతోపాటు రూ. వెయ్యి జరిమానా విధించారు. జరిమానా చెల్లించని యెడల అదనంగా మూడు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని జడ్జి సునీత కుంచాల తీర్పు వెల్లడించారు.

బైక్ చోరీ నిందితుడి అరెస్ట్



జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ గ్రామంలో ఇటీవల బైక్‌ను చోరీ చేసిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై తిరుపతి గురువారం తెలిపారు. ఈ నెల 5న పడకల్‌లో మేకల సాయన్నకు చెందిన గ్లామర్ బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా గురువారం మనోహరాబాద్ గ్రామ శివారులో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి బైక్‌పై అనుమానాస్పదంగా కనిపించాడు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా బైక్‌ను దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నట్లు ఎస్సై తెలిపారు. అతడు నిర్మల్ జిల్లా భాగ్యనగర్ గ్రామానికి చెందిన ముప్కాల రాకేశ్‌రెడ్డిగా గుర్తించి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

బోల్తా కొట్టిన కారు



నిజాంసాగర్ (జుక్కల్): మండలంలోని సంగారెడ్డి–నాందేడ్ జాతీయ రహదారిపై గురువారం షిఫ్ట్ డిజైర్ కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలు అయ్యాయి. కారు పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో క్రేన్ సాయంతో బయటకు తీశారు.

వడ్డేపల్లిలో ఒకరి ఆత్మహత్య

వర్ని: మండలంలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన వల్లెపు చిన్న పోశెట్టి (23)ఆత్మహత్యకు పాల్పడినట్లు వర్ని ఎస్సై రమేష్ గురువారం తెలిపా రు. పోశెట్టి భార్య మూడు సంవత్సరాల క్రితం అతడిని వదిలి వెళ్లడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. ఈ విషయంలో జీవితంపై విరక్తి చెంది ఎలకల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి సాయమ్మ ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.